
# విమలమ్మగారి విమాన ప్రయాణం



పొత్తూరి విజయలక్ష్మి



విమలమ్మగారి ఆనందం వర్ణనాతీతం. డబ్భై అయిదేళ్లు దాటాక ఎలా అయితేనేం ఆవిడ చిరకాల వాంఛ నెరవేరబోతోంది.

విమానం ఎక్కాలి. ఎప్పుడో చిన్నతనంలో ఆవిడ భర్త ఇంగ్లండు వెళ్లి వచ్చి విమాన ప్రయాణం గురించి నోరూరేలా చెప్పాడు. నన్నూ విమానం ఎక్కించరూ అంటే ఇంకా నయం విమానం అంటే మాటలా, నేనైనా నాన్నగారికి ప్రాణం మీదికి వచ్చింది కాబట్టే విమానంలో వచ్చాను అన్నాడు.

ఆవిడకి పిల్లల్లేరు. చిన్నతనంలోనే భార్యను పోగొట్టుకున్న అన్నగారి పిల్లలనే తన పిల్లలుగా పెంచి పెద్ద చేసింది. భర్తపోయాక వాళ్ల నీడనే వుంది.

మేనత్త అంటే పిల్లలందరికీ ఎంతో అభిమానం, గౌరవం. పువ్వుల్లో పెట్టి చూసుకుంటారు. ఆవిడకి ఏలోటూ రానివ్వరు. కానీ విమానం ఎక్కాలనే ఆవిడ కోరిక మాత్రం అలాగే మిగిలిపోయింది.

గోదావరి పుష్కరాలప్పుడు తన దగ్గర దాచుకున్న చిల్లరంతా తీసి మేనల్లుడికి ఇచ్చి ''ఒరే చిన్నిగా మనం గోదావరి స్నానానికి విమానంలో వెళ్దాంరా'' అంది.

అంతా పడీ పడీ నవ్వారు. ''అంతర్వేదికి విమానం వుండదు'' అన్నారు.

''నేను వెర్రిబాగుల దాన్ననుకుంటున్నారా? మొన్న వార్తల్లో చూశాను. ఓ పెద్దాయన బొబ్బర్లంక విమానంలో వెళ్లాడు. బొబ్బర్లంక వెళ్లిన విమానం అంతర్వేది వెళ్లదా ఏం విచిత్రం కాకపోతే!'' అంది.

''అబ్బా అది విమానం కాదు హెలీకాప్టర్'' అన్నారు పిల్లలు.

''ఏదైతేనేం విమానం విమానమే. ఏనుగంత విమానం కావాలని అడిగానా, ఆ ఎలికాప్టర్ చాలు నాకు'' అంది.

''అవన్నీ పెద్దపెద్దవాళ్లకు. హెలీకాప్టర్‌లో వెళ్లాలంటే విమానం కంటే ఎన్నో రెట్లు ఖర్చు అవుతుంది.'' అని వివరంగా చెప్పారు.

''అదీ నిజమేలే పెద్ద బస్సులో వెళ్లేకంటే చిన్నకారు ఖరీదేగా మరి'' అంది కాస్త

నిరాశగా. మేనల్లుళ్ల తరం గడిచిపోయింది. పిల్లల తరం వచ్చింది.

ఆవిడ సరదా చూసి విమానంలో తీసుకెళ్లాలనుకున్నారు.

కానీ టిక్కెట్టు ఖరీదు అయిదువేలు అనేసరికి ఆవిడ గుండె బాదుకుంది.

''ఇంకా నయం. అయిదే వేలే! మాకాలంలో ఆ డబ్బుతో మన సీత పెళ్లి చేశాం. వద్దులే. మాయదారి విమానం ఎక్కకపోతే పోయాను'' అంది.

అలా మరికొంతకాలం గడిచింది.

చెన్నయ్‌లో ఆవిడ పెద్దమేనల్లుడి షష్టిపూర్తి. ఆవిడ మూడో మేనల్లుడి దగ్గర విశాఖపట్నంలో వుంటోంది.

మేనల్లుడి కొడుకు సిద్ధార్థకి ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం. అతను ఈ ఫంక్షన్ కోసం చెన్నయ్‌లో ఏదో పని కల్పించుకున్నాడు. నాకెలాగూ వాళ్లే ఇస్తారు. మామ్మని నావెంట తీసుకొస్తాను. సీనియర్ సిటిజన్ కన్సెషన్ వుంటుంది కదా! అన్నాడు.

అందరూ సంతోషంగా సరే అన్నారు. ఆవిడ చెవినవేశారు.

''ఎన్నివేలురా'' అంది?

''కాస్త అటూ ఇటూగా రైలు టికెట్టంతేలే'' అని చెప్పారు. మొత్తానికి విమలమ్మగారి విమాన ప్రయాణం ఖాయం అయింది.

ఆవిడ ఆనందం అంతా ఇంతాకాదు.

ఆమాట అందరితోనూ చెప్పాలి. అలా అని గొప్పలకు పోయినట్లు వుండకూడదు. అందుకే ''నేను రేపటినుంచీ పురాణానికి రానమ్మా. మా సత్యం షష్టిపూర్తికి వెళ్తున్నాను. ప్రయాణం చెయ్యలేనేమో రాన్లే అన్నాను. నా మనవడు విమానంలో వెళ్దాం అన్నాడు'' అని గుంభనంగా ఫ్రెండ్స్‌తో చెప్పింది.

''ఒసే అప్పీ... విమానం వెళ్లే వేట్టికి నువ్వు డాబా మీద ఎక్కి నాకు చెయ్యివూపు'' అని పనిమనిషితో చెప్పింది.

''ఇదిగో సింహాచలం పనెగ్గొట్టి బీడితాగకు. రైల్లో వెళ్తోంది కదా! పెద్దమ్మగారికేం తెలుస్తుంది అనుకుంటావేమో. విమానంలో వెళ్తున్నాను. పైనుంచి నాకంతా కనిపిస్తుంది'' అని తోటమాలికి చెప్పింది.

మామూలు మల్లు పంచెలు బావుండవేమో అని గోరంచు చీరెతీసి పెట్టింది విమానం ప్రయాణానికి.

ఇంట్లో మిగిలిన వాళ్లంతా తెల్లవారు జామున రైల్లో బయలుదేరారు.

నువ్వు ఇప్పుడు మాకు వీడ్కోలు చెప్తున్నావా! రాత్రికి మేము చేరేసరికి ఇంట్లో స్వాగతం చెప్తావు'' అన్నారు.

ముసిముసి నవ్వులు నవ్వుకుంది. ''పిచ్చి సన్నాసులు పాపం రైల్లో అంతదూరం వెళ్లాలి'' అని జాలిపడింది.

ఫ్లైట్ మధ్యాహ్నం ఒంటిగంటకి.

పదకొండు గంటలకి ఇంట్లో బయలుదేరాలి అన్నాడు మనవడు.

''ప్రయాణం పెట్టుకుని మీరేం వండుకుంటారు. ఈ పూటకి మా ఇంట్లో భోజనం చెయ్యండి'' అన్నారు పొరుగువాళ్లు.

'ఎలాగూ విమానంలో అన్నంపెడతారట. కానీ ఆ ఉల్లిపాయలూ మసాలాలు నేను తిన్లేను' అని వాళ్లింట్లోనే భోజనం కానిచ్చింది విమలమ్మ.

ఇల్లు తాళం వేసి తాళాలు పక్కింటి వారికి ఇచ్చి బయలుదేరారు. ఆవిడ సంబరం అంతా ఇంతాకాదు.

ఎయిర్‌పోర్ట్‌కి చేరుకున్నారు మామ్మ, మనవడు.

చెక్ ఇన్ అయింది. సామాన్లు వెళ్లిపోయాయి.

''టికెట్టు ముక్క తీసుకొని లోపలికి పంపడానికి ఇంత హడావిడి ఎందుకురా?'' అంది ఆరాగా.

''భద్రత కోసం మామ్మా. గాల్లోకి ఎగిరాక ఎవరైనా బెదిరించి హైజాక్ చేస్తారేమో అని భయం'' అన్నాడు సిద్ధార్థ.

''ఓయమ్మో నిజమేరోయ్. ఆ మధ్యన విమానాన్ని దారిమళ్లించి ఎటో తీసుకుపోయి నానా గొడవా చేశారుగా దొంగభడవలు. మరికాస్త ఆలస్యం అయినా క్షుణ్ణంగా వెదకమని చెప్పిరానా ఆ పోలీసు పిల్లతో'' అని లేచింది.

''వద్దులే వాళ్లే వెతుకుతారు'' అని ఆపేశాడు మనవడు.

''ఒరే సిద్దూ ఆ నల్ల చొక్కావాడిని చూశావా! దొంగచూపులూ వాడూనూ. వాడిమీద నాకు అనుమానం వుంది సుమా.

ఆ పంచె కట్టుకున్నాయన్ని చూశావా. ఓ దగ్గర కూర్చోకుండా కాలు గాలిన పిల్లిలాగా ఎలా తిరుగుతున్నాడో. వీళ్లంతా విమానం దారిమళ్లించే ముఠా కాదుకదా! అన్నది.

''వూరుకో మామ్మా వాళ్లు వింటే బావుండదు' అన్నాడు మనవడు.

పావుగంట కూర్చుని ''ఇంకా ఎప్పుడురా విమానం ఎక్కేది?'' అని అడిగింది.

''ఇంకా చాలా టైముంది. ఇంకో గంట కూర్చోవాలి'' అన్నాడు.

''మరీ భాగ్యానికి ఇంత ముందుగా రావడమెందుకు? ఆ వేట్టికి వస్తే సరిపోదూ!'' అంది

''అదికాదు. మరి సెక్యూరిటీ గొడవులున్నాయిగా. అందుకే ముందు రమ్మంటారు.

''ఆ! వాళ్ల మొహం బొత్తిగా తెలివి తేటలు లేవు. ఇలా గంటలు గంటలు ముందు రప్పించి ఇక్కడ వూరికే కూర్చోబెడితే మంచివాడికి కూడా వెధవాలోచన్లువస్తాయి. అలా కాకుండా ఇలా మనుషులని రప్పించి అలా విమానం గాల్లోకి ఎగరేస్తే ఏ గొడవా వుండదు'' అంది సలహాచెప్తూ.

నవ్వేసి వూరుకున్నాడు సిద్దూ.

ఎలాగైతేనేం విమానం ఎక్కారు. ఆవిడని కిటికీ దగ్గర కూర్చోబెట్టాడు. కిటికీ ఇంకాస్త పెద్దదిగా వుంటే బావుండేది. సీట్లు మరికాస్త దూరంగా వుంటే విశాలంగా వుండేది అంది. మొత్తానికి నీ పుణ్యమా అని విమానం ఎక్కేశాను అని సంబర పడిపోయింది.

కాసేపు అయ్యాక ఎయిర్ హోస్టెస్ వచ్చి ఇంగ్లీషులో చెప్పింది. సిద్దూ అనువదించాడు. బుద్ధిగా సీట్ బెల్ట్ కట్టించుకుంది. చెవుల్లో దూదులు పెట్టుకుని చాక్లెట్టు నోట్లో వేసుకుని కూర్చుంది.

పెద్ద శబ్దంతో స్టార్ట్ అయింది విమానం.


రెండు నిమిషాలు అయ్యాక ''ఏవిటో వూరికే కంగారు పెట్టేశారు. తీరా చూస్తే కదిలినట్లే లేదు కదూ'' అంది ఆవిడ.

''ఎగిరేటప్పుడు కొంతమందికి కళ్లు తిరుగుతాయి. మన విమానం ఇంకా కదల్లేదు'' అన్నాడు సిద్దు.

కాసేపు హోరుపెట్టి ఆగిపోయింది విమానం.

ఇంగ్లీషులో అనౌన్స్‌మెంట్ వినిపించింది.

''ఇంజన్‌లో ఏదో లోపం వుందట. రిపేరు చేశాక కదుల్తుందిట.'' అని చెప్పాడు.



## వింత విగ్రహం

జర్మనీలోని బాల్‌ఫీల్డ్ సర్కిల్‌లో ఓ వింత స్టాచ్యూని నిర్మించారు. ముప్పై అడుగుల ఎత్తుతో దర్శనమిచ్చే ఈ స్టాచ్యూలో ఆడ-మగలు కలగలసి వుండటం విశేషం. ఇలా ఓ ఐదారు విగ్రహాలు మంచి సర్కిల్స్‌లో పెట్టి వుంచారు. ఒకవైపు నుంచి చూస్తే ఒక్కో మొహం దర్శనమిస్తే... ఒకవైపు భుజం భాగంలో నూ మరో బొమ్మ దర్శనమిస్తుంది. దగ్గరికెళ్లి చూస్తేగానీ ఇందులోని మర్మమేమిటో తెలియదని పర్యాటకుల అభిప్రాయం.



## హీరోను చెట్టుక్కట్టి కొట్టించిన నిర్మాత!

**త**మిళనాడుకు చెందిన సేలం పేరు వినగానే సినిమా అభిమానులకు గుర్తుకు వచ్చే మొదటిపేరు మోడర్న్ థియేటర్స్. దక్షిణ భారతదేశంలో ఎప్పుడో పాతికేళ్లక్రితమే వంద సినిమాలు తీసిన ఖ్యాతి ఆ సంస్థకు వుంది. అలాగే దక్షిణభారతదేశంలో తొలి కలర్ చిత్రం "ఆలీబాబా నలభై దొంగలు" తీసిన ఖ్యాతి కూడా వాళ్లదే. ఆ సంస్థ అధినేత టి.ఆర్.సుందరం. చండశాసనుడు. క్రమశిక్షణకు మారుపేరు. సేలంలోని తన స్వంత స్టూడియోలోనే ఆయన సినిమాలు తీసేవారు. దాదాపు యాభై ఏళ్లక్రితం నాటి మాట ఇది. ఆరోజుల్లో ఎంతటి ప్రముఖ తార అయినా సరే సేలం వెళ్లి వాళ్లు ఏర్పాటుచేసిన బసలో వుండి నటించి రావలసిందే. తమిళనాట అప్పట్లో పి.యు.చిన్నప్ప అనే నటుడు హీరోగా చాలా పాప్యులర్. అతన్ని నాయకునిగా పెట్టి సుందరం ఒక సినిమా తీస్తున్నారు. కొత్త షెడ్యూల్ ప్రారంభం. ముందుగానే కాల్‌షీట్లన్నీ మాటాడేసుకున్నారు. చిన్నప్ప ఆరోజు షూటింగ్‌కి రావాలి. కానీ అతగాడు రాలేదు. రావడంలేదని ముందుగా కబురన్నా చేయలేదు. షూటింగ్ ఆగిపోయింది. కాంబినేషన్ సీన్స్. మిగతా తారల కాల్‌షీట్లుకూడా వ్యర్థమయినాయి. సుందరం కుతకుతలాడిపోయారు. ఆ మర్నాడు చిన్నప్ప ఈలేసుకుంటూ కారు దిగాడు. పట్టరాని కోపంతో సుందరం తన మనుషులతో అతన్ని చెట్టుకు కట్టేయించాడు. అంతటితో ఊరుకోకుండా చింతబరిక చేతికిచ్చి చావబాదించాడు. కట్టుతప్పితే ఆరోజుల్లో హీరోలకు కూడా ఇలా ఘనంగా 'పురస్కారాలు' ఉండేవి. నిర్మాతంటే అప్పట్లో కుటుంబ పెద్ద. అంతా ఆయన చెప్పింది వినవలసిందే. మరి ఇప్పుడో....? పాపం అనాథ.

''సరిపోయింది. ఆదిలోనే హంసపాదా! సర్లే ఏం చేస్తాం. రిపేరీ చేస్తారులే. మహా అయితే మరో గంట ఆలస్యంగా వెళ్తాం అంతేగా'' అంది.

బయట జీపుల్లో జనం గుంపులుగా వచ్చి బాగు చేసే ప్రయత్నాలు మొదలుపెట్టారు. అర గంట దాటింది.

క్రమంగా లోపలి వాతావరణం వేడెక్కడం మొదలయింది.

ఉక్కగా వుంది. ''ఇదిగో ఓ అమ్మాయ్. ఇట్రా అమ్మా. బొత్తిగా గాలి ఆడడం లేదు. కాస్త ఈ కిటికీ తెరుస్తావా?'' అంది విమలమ్మ ఎయిర్‌హోస్టెస్‌తో.

తెలుగురాని ఆవిడకి ఈవిడ బాధ అర్థం కాలేదు. సిద్ధూ ''అలావీలుకాదు మామ్మా అది సీలు చేస్తారు. కిటికీలు తెరుచుకోవు'' అన్నాడు.

''ఇదొక గొడవ కాబోలు పోనీ ఓ విశనకర్ర వుంటే ఇలా పడెయ్యమని చెప్పు'' అంది.

''మామ్మా విమానంలో విశనకర్రలు ఎక్కడి నుంచి వస్తాయి?'' కాస్త విసుక్కున్నాడు.

''మరెలారా? ఇంకాసేపుంటే ఆవిరికుడుంలా వుడికిపోయేలా వున్నాం. పోనీ దిగి బయట నిల బడదామా. గాలాడుతుంది. విమానం బయలుదేర గానే ఎక్కేయచ్చు'' మరో మార్గం సూచించింది.

''ఎలా? మెట్లు తీసేసి వాకిలి మూసేశారు కదా?'' అన్నాడు సిద్ధూ.

''మండినట్టే వుంది. దీనికన్నీ అవలక్షణాలే'' అంది చెమటలు తుడుచుకుంటూ.

విమానం స్టార్ట్ అవుతుంది గానీ కదలడం లేదు. ఆ మాటే అందరూ అనుకుంటున్నారు.

''కదలకపోతే తలోచెయ్యివేసి తోస్తే సరిపోదూ. మా చిన్నతనంలో మా ఊళ్లో తిరిగే బసవలింగం గారి బస్సు ఆగిపోతే అందరూ దిగి తోసేవారు'' ఉచిత సలహా చెప్పింది.

పక్కవాళ్లంతా విని నవ్వుకున్నారు.

''బస్సులు తోస్తే స్టార్టు అవుతాయి గానీ రైళ్లు, విమానాలు ఆగిపోతే తొయ్యలేరు'' అన్నాడు నవ్వాపుకుంటూ సిద్ధూ.

మరో అరగంట తంటాలు పడి లాభం లేదని చేతులెత్తేశారు సాంకేతిక నిపుణులు. అన్ని భాష ల్లోనూ క్షమాపణలు చెప్పి అందరినీ కిందకి దిగమని ప్రార్థిస్తూ తలుపులు తెరిచి చేతులు జోడించి నిలబడ్డారు విమాన సుందరులు. అందరూ ఈసురోమని కిందకు దిగారు.

విమలమ్మ ఉత్సాహం నీరుగారిపోయింది. ''ఇక్కడే ఆగి ఇంకో విమానం వస్తే దాన్లో ఎక్కి వెళ్లిపోదాం'' అంది.

''ఇదేమైనా బస్సా! ఒకటి తప్పిపోతే మరొకటి ఎక్కేందుకు? ఇవేళ్టికి ఇంక లేవు విమానాలు. పద ఇంటికెళ్దాం'' అన్నాడు జాలిగా

డబ్బులు తిరిగితీసుకుని టేక్సీలో ఇంటికి చేరేసరికి చీకటి పడింది.

దార్లోనే జరిగినదంతా మెడ్రాస్‌కి ఫోన్‌చేసి చెప్పాడు. అంతా బాధపడ్డారు.

ఇల్లు తాళం వేసివుంది. తాళం చెవులు తీసుకున్న పక్కవాళ్లు కూడా ఇల్లు తాళంపెట్టి ఊరెళ్లారు.

ఏం చెయ్యాలో తెలియక దూరపుబంధువుల ఇంటికి వెళ్లారిద్దరూ. వాళ్లు ముందు రండి రండి అని ఆహ్వానించినా విషయం తెలుసుకుని మొహాలు మాడ్చుకున్నారు.

విమలమ్మని అక్కడ వదిలిపెట్టి ఫ్రెండింటికి వెళ్తానని చెప్పాడు.

మర్నాడు పొద్దున రైల్లో టికెట్ల కోసం ప్రయ త్నిస్తానని అన్నాడు. కానీ దొరకలేదు. ఆ మర్నాడు షష్టిపూర్తి. ఇక వెళ్లినా ఒకటే వెళ్లకపోయినా ఒకటే.

తమ తాళం తీసుకున్న ఇంటివారు మూడు రోజుల తరువాత వచ్చారు. ఈ మూడురోజులూ వారాల విద్యార్థిలా ఆరిళ్ళు తిరిగింది విమలమ్మ.

అంతగా గాల్లోకి ఎగరలేకపోతే కిందేపడుం డొచ్చు కదా. ఈ హడావిడీ ఆర్భాటం ఎందుకు? మనుషులని హైరానా పెట్టి చంపటం ఎందుకు?' అని విసుక్కుంది. ''పైన పటారం లోన లొటారం'' అని చిరాకు పడింది.

విమానం అంటే విరక్తి పుట్టింది ఆవిడకి. జరిగిన దానికి బాధపడి ఇంట్లోవాళ్లు ఒకటి రెండుసార్లు మళ్లీ విమానం ఎక్కించాలని ప్రయత్నం చేశారు. కాలినడనైనా పోతానుగానీ నేనెక్కనమ్మా ఆ పీడాకారం అని చెప్పేసింది.

ఆ తర్వాత కూడా గాల్లో విమానం కనిపిస్తే 'పాపం ఏ తలకుమాసిన వెధవలు ఎక్కారో దిక్కుమాలిన విమానం' అని జాలిపడేది విమలమ్మ గారు.